ప్రజాశక్తి
బుధవారం 28 ఫిబ్రవరి 2024

అన్నదాతకు రైతు భరోసా సాయం

- నేడు నిధులు విడుదల
- అనంతకు రూ.59.01 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు రూ 55.9 కోట్లు
- పంటనష్ట పరిహారం అందేదెన్నడో . ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పిఎం కిసాన్ రైతు భరోసా మూడవ విడత డబ్బులతోపాటు వైఎస్ఆర్ సున్నావడ్డీ పథకం డబ్బులను బుధవారం నాడు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నిధులను విడుదల చేయనున్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలోనూ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెండు జిల్లాల కలెక్టర్లు వారివారి కార్యాలయాల్లో పాల్గొని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేయనున్నారు.

అనంతకు రూ.59.01 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు రూ 55.9 కోట్లు

అనంతపురం జిల్లాకు సంబంధించి 2,94,353 మంది రైతులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పిఎం కిసాన్ మూడవ విడత కింద రైతులకు రూ.59.01 కోట్ల నిధులు విడదల చేయనున్నారు. పంటరుణం తీసుకుని ఈ క్రాప్ బుకింగ్ అయ్యి, సకాలంలో రుణం తిరిగి చెల్లించిన వారికి సున్నావడ్డీ పథకం కింద 2021 సంవత్సరంలో రబీలోనూ, 2022 ఖరీఫ్‌లో కలిపి మొత్తం 83,534 మంది రైతులకు రూ.17.25 కోట్లు నిధులు విడుదల చేయనున్నారు. ఇక సత్యసాయి జిల్లాకు సంబంధించి 2,79,580 మంది రైతులకు రూ.55.9 కోట్లు నిధులు పిఎం కిసాన్ కింద అందజేయనున్నారు. ఉదయం పది గంటలకు బటన్ నొక్కి పంపిణీ కార్యక్రమం ప్రారంభమవనుంది.

పంటనష్ట పరిహారం ఎప్పుడో..!

రైతు భరోసా, సున్నా వడ్డీ వచ్చినప్పటికీ గతేడాది పంటనష్టానికి సంబంధించి పరిహారం ఎప్పుడు వస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. అనంతపురం జిల్లాలో రూ.250 కోట్ల మేరకు ఇన్‌పుట్ సబ్సిడీకి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కేంద్ర కరువు బృందాలు కూడా పర్యటించి వెళ్లాయి. ఇప్పటి వరకు పరిహారంపై మాత్రం ప్రకటన రాలేదు. మరికొన్ని రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఈ పరిహారం సంగతి అటకెక్కే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతి నాటికే పరిహారాన్ని రైతులకు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలు జరగేదు. ఇప్పటికైనా ప్రకటన చేసి పరిహారం అందివ్వాలని రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వం ఎన్నికల్లోపు ప్రకటన చేస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

పరిశ్రమ జీవనం.. భద్రత దయనీయం.!

- 'పురం' పారిశ్రామిక వాడలో వలస కార్మికుల కష్టాలు
- ఉక్కు పరిశ్రమల్లో నిరంతర ప్రమాదాలు
- కార్మికులు మృతి చెందినా...గాయపడినా బయటకు రాని వివరాలు
- మామూళ్ల మత్తులో కన్నెత్తి చూడని అధికారులు

శ్రమను నమ్ముకున్న కార్మికులు కుటుంబ పోషణ నిమిత్తం పొట్టచేతబట్టుకుని రాష్ట్రం గాని రాష్ట్రం వచ్చి పనులు చేస్తున్నారు. పరిశ్రమల్లో మలమలమండే అగ్నిని రగిల్చే బాయిలర్ల వద్ద ప్రతిక్షణం ప్రాణాలను అరచేతబట్టుకుని పనులు చేస్తుంటారు. ఇలా 'పురం' పరిధిలో సడ్లపల్లి, తూమకుంట, గోళాపురం, కొట్నూరు పారిశ్రామిక వాడల్లో వేలాది మంది కార్మికులు పనులు చేస్తున్నారు. ఈ పారిశ్రామికవాడల్లో దాదాపు 125 నుంచి 200 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో కేవలం ఉక్కు, రసాయన పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. ఇందులో పనులు చేస్తున్న వారందరూ కూడా బయట రాష్ట్రాలకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉంటారు. ఒక్కో సమయంలో బాయిలర్ల వద్ద ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్నారు. చాలా మంది గాయపడతున్నారు. ప్రమాదాలు జరిగినా పరిశ్రమల యాజమాన్యం విషయాన్ని బయటకు పొక్కనివ్వడం లేదు. వీటిపై నిఘా ఉంచి కార్మికుల భద్రతను పరిరక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

'పురం' పారిశ్రామిక వాడలోని ఉక్కు పరిశ్రమలో సంభవించిన అగ్ని ప్రమాదం(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండలంలోని పారిశ్రామిక వాడ, పెనుకొండ రోడ్డు పరిగి మండలం మదుగిరి రోడ్డులో దాదాపు 20 నుంచి 25 ఉక్కు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలు ప్రమాదాలకు నిలయంగా మారాయనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో ఆ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకే అర్థం కావడం లేదు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులంతా బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, జార్ఖండ్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువగా ఉంటారు. ఏ పరిశ్రమల్లో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారన్న విషయాలను సైతం ఉక్కు పరిశ్రమల యాజమాన్యాలు గోప్యంగా ఉంచుతున్నారు. ప్రమాదాలు సంభవించి కార్మికులు మృతి చెందినప్పటికి వారి వివరాలను మాత్రం బయటకు పొక్కనివ్వడం లేదు. పలు పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు కార్మికులు మృతిచెందినా వారి వివరాలను బయటకు తెలియనివ్వకుండా మాయ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వస్తే జరిగిన ప్రమాదాలు బయటకు తెలుస్తాయన్న ఉద్దేశంతో వారిని ఎవరికీ తెలియనివ్వకుండా చికిత్స పేరుతో కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరుకు తీసుకెళ్లి అక్కడ వైద్య సేవలను అందిస్తున్నారు.

ప్రమాదకరంగా పనులు

ఉక్కు పరిశ్రమల్లో కార్మికులు ఎలాంటి రక్షణ లేకుండా బాయిలర్ వద్ద పనులు చేస్తున్నారు. బాయిలర్లలో కొన్ని వేల డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఆ ప్రదేశంలో దాదాపు 30 నుంచి 40 మంది కార్మికులు పనిచేస్తుంటారు. ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై బాయిలర్ పేలిపోతే మొత్తం కార్మికులు కాలి బూడిదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇలాటి సంఘటనలు గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నోసార్లు, ఎన్నో పరిశ్రమల్లో జరిగాయి. తాజాగా హిందూపురం రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడలోని కుబేర స్టీల్ పరిశ్రమలో ఐదు రోజుల క్రితం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 7 మంది గాయపడినట్లు తెలుస్తోంది. యాజమాన్యం 5 మంది గాయపడ్డరని, గాయపడిన వారిని కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరులోని మానస అసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలను అందించామని చెబుతున్నారు. రెండు నెలల క్రితం ఇదే ప్రాంతంలోని ఏ-వన్ ఇస్ప్యాక్ట్ స్టీల్ పరిశ్రమలో సైతం ఇదే రకమైన ప్రమాదం చోటు చేసుకుని కార్మికులు గాయపడ్డారు. గాయపడిన వారిని యాజమాన్యం గౌరిబిదనూరుకు తీసుకెళ్లి వైద్య సేవలను అందించారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు సమాచారం. మృతి చెందిన బాధిత కుటుంబానికి నిబంధనలు మేరకు రూ.12.50లక్షలు ఇవ్వాల్సి ఉంటే రూ.7.50లక్షలు ఇచ్చి యాజమాన్యం చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని తూముకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్ కార్మికశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాగా, బాధిత కుటుంబానికి నిబంధనల మేరకు ఇవ్వాల్సిన పూర్తి సాయాన్ని యాజమాన్యం అందించింది.

కాలుష్యాన్ని విరజిమ్ముతున్న ఉక్కు పరిశ్రమ

మామూళ్లమత్తులో కార్మిక, పరిశ్రమల భద్రత, కాలుష్య శాఖలు

కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాల్సిన కార్మిక, పరిశ్రమల భద్రత, కాలుష్య శాఖల అధికారులు పరిశ్రమల యాజామాన్యలు ఇచ్చే ముడుపుల మైకంలో ఉన్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. వలస కార్మిక చట్టం ప్రకారం వలస కార్మికుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంది. పురం పారిశ్రామిక వాడ ప్రాంతంలో ఇలాంటిది ఏదీ జరగడం లేదు. ఏ రాష్ట్రం నుంచి ఎంత మంది కార్మికులు వలస వచ్చి పని చేస్తున్నారు..? ఏ గుత్తేదారుడు కింద ఎంత మంది పని చేస్తున్నారు..? అన్న విషయాలు అధికారుల వద్ద మచ్చుకైనా కన్పించవు. నిబంధనల మేరకు వలస వచ్చిన ప్రతి కార్మికునికీ రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంది. ఈఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలి. ఇలాంటివి ఏవీ పరిశ్రమల్లో కన్పించవు. పరిశ్రమల్లో అధికారులు నామమాత్రంగా అయినా తనిఖీలు చేసిన దాఖలాలు ఉండవు. ఉక్కు, రసాయన పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో కార్మికుల నిండు జీవితాలు బలవుతున్నప్పటికీ కాలుష్యశాఖ పట్టించుకోదు. కాలుష్యంపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన కాలుష్య నియంత్రణ అధికారులు ఎప్పుడో ఓసారి చుట్టపుచూపుగా వచ్చివెళ్తుంటారు. ఈ తనిఖీల సమయంలో కూడా అధికారులు ముడుపులు తీసుకుని వెళ్లిపోతుంటారనే విమర్శలు ఉన్నాయి.

వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి

కార్మిక శాఖ అధికారులు తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడల్లో వలస కార్మిక చట్టాన్ని కఠినంగ అమలు చేసి, కార్మికుల వివరాలను సేకరించాలి. సేకరించిన కార్మికుల వివరాలతో పాటు కార్మికులను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన గుత్తేదారుల వివరాలను కార్మిక సంఘాలకు అందజేయాలి. కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. కార్మిక చట్టాలను అధికారులు అమలు చేయాలి.

ఈఎస్.వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

నిరంతరం తనిఖీలు చేపట్టాలి

తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమలపై కార్మిక, కాలుష్య, పరిశ్రమల భద్రత శాఖల అధికారులు నిరంతరం తనఖీలు చేయాలి. పరిశ్రమల్లో కార్మికులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి. తనిఖీల పేరుతో అధికారులు వచ్చి పరిశ్రమల నిర్వహకులు ఇచ్చే ముడుపులు తీసుకుని వెళ్లడం సరికాదు.

రవికుమార్,
కార్మిక సంఘం నాయకులు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అధ్వర్యంలో తెలుగదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వందలాది మంది రైతులతో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నిర్లక్ష్యంతోనే విద్యుత్తు కోతలు అధికం అయ్యాయని అన్నారు. నిరంతరం పగటి పూట రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సైకో జగన్ పాలనలో రాష్ట్రంలో విద్యుత్ కోతలు అధికం అయ్యాయని అన్నారు. ఎక్కడ చూసినా విద్యుత్ కోతలతో ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలు, వరి, వేరుశనగ, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ రైతు కూడా సంతోషంగా లేడన్నారు. సైకో జగన్ పాలనకు స్వస్తి పలకాలని కోరారు. వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్ పార్మర్లు తక్షణం మంజూరు చేయాలని కోరుతూ ట్రాన్స్ కో ఏడీఈ ఓబులేసు, ఏఈ రామసురారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నియోజకవర్గ పరిశీలకుడు పార్థసారథిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, డాక్టర్ జాకీర్ అహ్మద్, మాజీ ఎంపిటిసి రామానాయుడు, పీట్ల సుధాకర్, అంజనప్ప, నిజాం, ఓబుల్ రెడ్డి, సర్పంచి శంకర్ రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, తుమ్మల మహబూబ్ బాషా, మాజీ కన్వీనర్ రాజారెడ్డి , కొండే ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

డిడిపిలో పలువురు చేరిక : మండల పరిధిలోని ఇనగలూరు పంచాయతీలోనీ గొల్లపల్లి, ఇనగలూరు గ్రామాల నుంచి సుమారు 53 కుటుంబాలు వైసీపీని వీడీ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి అరాచక పాలనకు స్వస్తి పలకాలని ప్రజలకు పిలపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈతచెట్లు ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఈతచెట్ల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని కంచి సముద్రం వద్ద ఉన్న వందలాది ఈతచెట్లను అధికార పార్టీ అండదండలతో కొంతమంది ధ్వంసంచేసి నేలను చదును చేసి ఆక్రమించుకుంటున్నారని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు సిపిఎం జిల్లా నాయకులు పెద్దన్న, టిడిపి నియోజకవర్గ నాయకులు చిన్నప్పయ్య మంగళవారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రోద్భలంతోనే భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా భాధితులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి ఈత చెట్లను పెంచుకొని కుటుంబలను పోషించుకొంటున్నమని ఇలా ఉన్నపళంగా ఈత చెట్లను తొలగించి భూమిని ఆక్రమిస్తుండటంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది గీత కార్మికుల కుటుంబాల న్యాయం కోసం పోలీసుల ఆశ్రయించగా పోలీసులు కూడా 500 రూపాయలు జరిమానా వదిలేశారని వాపోయారు. గీతకార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని సిపిఎం నాయకులు హెచ్చరించారు.

పెనుకొండ : రొద్దం మండలం ఆర్ కంచిసముద్రం లో మంత్రి ఉషశ్రీ చరణ్ అనుచరుల భూకబ్జాపై పెనుకొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భూ కబ్జా కోసం 500 ఈత చెట్లను అధికార పార్టీ వారు ధ్వంసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహిద్దాం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులను నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు కలెక్టరేట్లో నియోజకవర్గాల అధికారుల విధులు, ఓటరు క్లెయిమ్‌ల పరిష్కారం, పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఏమాత్రం ఉల్లంఘించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోడ్ అమల్లో వచ్చినప్పటి నుంచి సిబ్బంది అంతా భారత ఎన్నికల సంఘం ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన హ్యాండ్‌బుక్‌లో ఉన్న అంశాలపై ఎన్నికల సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెక్టార్ అధికారులతో పాటు పోలీస్ సెక్టార్ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. జిల్లాలో 1561 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో నియోజకవర్గం ఎన్నికల అధికారులు మౌలిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. 1500 ఓట్లు మించి ఉంటే మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ల సవరణ క్లైములు ఫారం 6, 8 త్వరగతిన ఈనెల 29కి పూర్తి చేయాల న్నారు. జిల్లా సరిహద్దులో తనిఖీ అధికారులు అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ స్టేషన్లను రూట్ వారీగా గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యుత్, తాగునీరు, వసతి, తదితర ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి గట్టి నిఘా పెట్టాలన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల విధులను ఎవరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. నిర్లక్ష్యం చూపితే ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. జిల్లాలో 390 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన సంఘటనలను తప్పనిసరిగా వీడియో రికార్డు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో కదిరి, ధర్మవరం, పుట్టపర్తి ఆర్డీవోలు వంశీకష్ణ, వెంకటరామిరెడ్డి, భాగ్యరేఖ, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, శ్రీలత, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

ప్రాథమిక విద్యే పునాది

ప్రజాశక్తి - హిందూపురం

విద్యార్థులకు ప్రాథమిక విద్యే పునాది అని సువర్ణ భారతీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి అన్నారు. సువర్ణ భారతీ జూనియర్ కళాశాల వ్యవస్థపక అధ్యక్షులు, ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి కుమారుడు గగన్ శ్యామ్ రెడ్డి ఇటీవల జెఈఈ మెయిన్స్‌లో 99.58 శాతం మార్కులు సాధించి జాతీయ స్థాయిలో రాణించాడు. గగన్ శ్యామ్ రెడ్డి ప్రాథమిక విద్యను పాంచజన్య పాఠశాలలో చదువుకున్నాడు. పాఠశాలలో స్థాయిలో ఎంతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి పోటీ ప్రపంచంలో పోటీ తత్వాన్ని నేర్పించడంతో మంగళవారం సువర్ణ భారతీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠ రెడ్డితో పాటు కళాశాల అధ్యాపకులు పాఠశాలలో పాంచజన్య శ్రీనివాసులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఒ అనీల్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - హిందూపురం

ఇటీవల జాతీయ స్థాయిలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అబియాన్స్ ఇండియా (ఎన్ఐఎస్ఎ) జాతీయ స్థాయిలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎన్ఎఎటి -2023 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి ముస్తఫా జాతీయస్థాయిలో ప్రథను ర్యాంకు, ద్వితీయ ర్యాంకు రిధా ఫాతిమాలు సాధించారు. వీరు గత బుధవారం డిల్లీలోని హయాత్ హెరిటల్ లో పద్మశ్రీ డాక్టర్ జితేందర్ సింగ్, ఎన్ఐఎస్ఎ అధ్యక్షులు కుల భూషణ్ శర్మ చేతుల మీదుగా బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మంగళవారం ప్రథమ, ద్వితీయ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు అభినందించారు. త్వరలో ముస్తఫా లండన్ లో కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో ప్రథమ బహుమతిని అందుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎం సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో ఆందోళన

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని కంచిసముద్రం పంచాయతీ పరిధిలోని ఎస్‌సి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆకాలనీవాసులు సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. మంగళవారం స్థానిక సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నెలరోజుల నుంచి సమస్య నెలకొన్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రమేష్ రెండు రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, నరసింహప్ప, మహిళలు ప్రేమావతి, చంద్రకళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

సైన్స్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి మడకశిర

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ఉన్న మేధాశక్తిని వెలికితీయడానికే జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస భాస్కర్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కదిరేపల్లి సైయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస భాస్కర్ మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న మేధాశక్తిని వెలికి తీయడానికి ఇది మంచి వేదిక అని అన్నారు. ఈ పాఠశాలలోని విద్యార్థులు 300 నమూనాలు ఆకర్షణీయంగా తయారు చేసి ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ సుభాన్ వ్యవహరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శన తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జోస్పిన్ లీల్లి సిస్టర్, సైన్స్ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు రామకృష్ణ,ఉమేష్, ఓబుల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

సచివాలయాల తనిఖీ

కొత్తచెరువు : మండలంలోని పలు సచివాలయాలను డిఎల్‌డిఒ శివారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కొత్తచెరువులోని నాలుగు సచివాలయాలను, నాగిరెడ్డిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆయన అక్కడి రిజిస్టర్లను పరిశీలించారు. సచివాలయాల్లో రిజిస్టర్లను తనిఖీ చేసి సకాలంలో విధులకు హాజరు కావాలని ఉద్యోగులకు సూచించారు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపాల్, సచివాలయ కార్యదర్శులు నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ధర్మవరం టౌన్ : తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆసంఘం రాష్ట్ర కౌన్సిలర్ బీకే ముత్యాలప్ప, శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు బలరాముడు, రవీంద్రారెడ్డి,మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, శివానంద, జగదీశ్, శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రదానంగా ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వ పీఆర్సీ జూలై 2023 నుండి అమలు పరచాలని, 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని, 11వ పీఆర్సీ బకాయిలతో పాటు పీఎఫ్, సీబీఎల్‌ఎ గుణాలు ఇతర బకాయిలను విడుదలచేయాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిలమత్తూరు : మండల పరిధిలోని వీరాపురం చాగలేరు, కోడూరు, శెట్టిపల్లి గ్రామ పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ భాగ్యలత మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, వీఆర్వో శివయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల పరిధిలోని మద్దనకుంట, కెకె. పాలెం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను మడకశిర రిటర్నింగ్ అధికారి శంకరరావు మంగళవారం పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి, ఆర్ఐ మహమ్మద్ బిలాల్, వీఆర్వో త్యాగరాజు, దీపారాణి, ఎన్నికల జెఎ.రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

బుక్కపట్నం : గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ లక్ష్యం అని జిల్లా నైపుణ్యభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సత్య సాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో రెండు కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా 35 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. వీరిలో ఆరుగురిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేద్దాం

రొద్దం : ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేద్దామని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం మండలంలోని దొడగట్ట, రెడ్డిపల్లి, రొద్దం, లోచర్ల, తురకలాపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామాల్లోని ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాల గురించి వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మారుతి రెడ్డి, కలిపి శ్రీనివాసులు, అక్కులప్ప, సి నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ తిమ్మయ్య, వైస్ ఎంపీపీ అంజనా రెడ్డి, సర్పంచులు రూప, రామాంజి, శివరాజు, నరేందర్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, వినయ్ రెడ్డి, పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,CHINTHAKUNTA LAXMI PRASUNA (old name) D/o CHINTAKUNTA GAJJALA REDDY, D.NO.28-4-851, SARADA NAGAR, MADHURA NAGAR, ANANTAPUR DIST. ANDHRA PRADESH, 515001, change my name from CHINTHAKUNTA LAXMI PRASUNA (old name) to CHINTAKUNTA LAXMI PRASUNA (newname)Henceforth I am called as CHINTAKUNTA LAXMI PRASUNA for all purposes.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, కదిరి

O.S.NO:422/2023

Between:

1.మాక లక్ష్మినారాయణమ్మ W/o నరసింహారెడ్డి,
2.మాక మహేశ్వర రెడ్డి S/o నరసింహారెడ్డి,
3.విజయమ్మ W/o ఓబిరెడ్డి క్రిష్ణారెడ్డి,
4.భారతి W/o కె.సునీల్ కుమార్
D.No:13-35 మామిడిమాకులపల్లి గ్రామం, అమడగూరు మండలం,శ్రీ సత్యసాయి జిల్లా. ...వాదులు

మరియు

మాక జయమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు

3వ 4వ ప్రతివాదులకు దావా నోటీసులు

To
R3:ధనలక్ష్మి W/o అమరనాథరెడ్డి,
R4:లక్ష్మినారాయణమ్మ W/o వెంకటరమణారెడ్డి,
D.No:13-38, మామిడిమాకులపల్లి గ్రామం, అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. అను మీ పైన వాదులు అయినటువంటి మాక లక్ష్మినారాయణమ్మ మరియు ఇతరులు తమ పై దావాలో ఆస్తి బాగ పరిష్కారం కొరకు పై వారి కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు.సదరు దావా మీ హాజరు నిమిత్తం పై వారి కోర్టు నందు 04/03/2024వ తేదిన వాయిదా వేయబడి ఉన్నది. సదరు వాయిదా తేదిన మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మీకు ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని మీ పరోక్షంలో తీర్మాణం చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:04/03/2024
స్థలం:కదిరి

కె.గంగాధర్, బి.కామ్., బి.ఎల్,

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి - బత్తలపల్లి

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌళిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం మండలంలోని మాల్యవంతం గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏదైనా సమస్యలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు వాటికి సంబంధించిన వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, సెక్టార్ ఆఫీసర్ భవ్య, డీఎస్పీ శ్రీనివాసులు, ఎఎస్ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, ఎస్ఐ శ్రీనివాసులు, విఆర్ మణికుమార్, సెక్టార్ ఆఫీసర్లు, విఆర్ఎలు, బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మంగళవారం తనిఖీచేశారు. పట్టణంలోని శాంతినగర్, గూడ్స్‌షెడ్, సంజయ్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి ఓటరు ఓటు హక్కువినియోగించుకునేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకతతో కూడిన ఓటరు జాబితాను తయారు చేసేలా అందరు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటశివారెడ్డి, కమిషనర్ రాంకుమార్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఈశ్వరయ్య, డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం, వీఆర్వో యోగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి

తుపాకి పట్టుకునే విధానం చూపుతున్న కమాండెంట్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

హోంగార్డులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హోంగార్డుల కమాండెంట్ మహేష్ కుమార్ సూచించారు. పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల విజిటింగ్ పెరేడ్ ఇన్స్‌పెక్షన్ వెల్ఫేర్ సమావేశాన్ని స్థానిక పరేడ్ మైదానంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కమాండెంట్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డులకు ఆయన సూచించారు. హోంగార్డుల దైనందిక విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని. సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని బాగా మెరుగుపరుచుకోవాలన్నారు. ఈసందర్భంగా డ్రిల్, కవాతు, ప్రముఖులకు బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. రాబోవు ఎన్నికలలో విధినిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు సలహాలు వివరించారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలు ఈసందర్భంగా ప్రస్తావించారు. హెూంగార్డ్స్ సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని కమాండెంట్ తెలిపారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మెరిట్ స్కాలర్‌షిప్‌ను అర్హులైన హోంగార్డులు ఉపయోగించుకోవాని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి విజయ కుమార్, ఎఆర్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఎఆర్ ఎస్ఐ శ్రీరాములు, సబ్ డివిజన్ హోంగార్డుల ఇన్‌ఛార్జి, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నల్లచెరువు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని,సంక్షేమ బోర్డు నిధులు రూ.2000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డుకు జమ చెయాలనిడిమాండ్ చేశారు. భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28,29 తేదీల్లో జిల్లాలోని అన్ని నియోజవర్గ కేంద్రాల్లో రిలేనిరాహార దీక్షలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో సోమందేపల్లి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల కేంద్రంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ చెందిన ఆరవ తరగతి విద్యార్థి బి. స్కందన్ గౌతమ్ అబాకస్ పోటీల్లో ప్రతిభ కనపర్చారు. అనంతపురంలో జరిగిన అబాకస్ జోనల్ లెవెల్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గౌతమ్ జోనల్ స్థాయిలో రెండవ బహుమతి పొందాడు. మార్చి నెలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు అర్హత సాధించాడని పాఠశాల సిబ్బంది తెలిపారు. విద్యార్థి ప్రతిభపై అతని తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని చూపుతున్న విద్యార్థి

రైతులపై తుపాకుల మోత మోగించడం రామరాజ్యమా..?

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

కదిరి టౌన్ : రైతులపై తుపాకుల మోత మెగించడం రామరాజ్యమా అని .ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి యం. వేమయ్య యాదవ్ ప్రశ్నించారు. పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథిగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము పండించిన పంటలకు మద్దతు ధరలు ఇవ్వాలని రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం వారిపై కర్కశంగా ప్రవర్తించి పోలీసుల ద్వారా కాల్చి చంపుతోందని విమర్శించారు. దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేటర్లకు రెడ్ కార్పెట్ వేసి గులాంగిరి చేయడమేనా రామరాజ్యం అని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టేందుకు రైతులు, రైతు కూలీల పొట్ట కొట్టేందుకు బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్ర ప్రయోజనాలను రాష్ట్ర భవిష్యత్తును రైతన్న ప్రయోజనాలను దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బిజెపిని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమంతు రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

హనుమ విహారికి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - మడకశిర

క్రికెటర్ హనుమ విహారికి, ఆంధ్ర ప్రజలకు వైసిపి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకుల అహం ఏపీ లో క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిని దెబ్బ తీస్తోందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం, మంత్రి రోజా హనుమ విహారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పెనుకొండ : హనుమ విహారికి వైసిపి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. సవితమ్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నాయకుల అహం క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తోందన్నారు. వైసీపీ నేతల ఒత్తిళ్లతో తెలుగుతేజాలు పక్క రాష్ట్రాలకు వెళుతున్నారన్నారు. వైసీపీ నేత కుమారుడిని మందలించిన పాపానికి విహారిని ఆంధ్ర రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించేలా కుట్ర చేశారన్నారు. వైసీపీ నేతలు రాజారెడ్డి రాజ్యాంగాన్ని క్రికెట్ లో కూడా అమలు చేస్తున్నారని ఆరోపించారు.

టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

టిడిపితోనే రాష్ట్రానికి ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్లు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో 1వ వార్డు గుడ్‌షెడ్ కొట్టాలలో మంగళవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకుగ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌యుడు, రాళ్లపల్లిషరీఫ్, శీలామూర్తి, జిలకరశీన, గోసలశ్రీరాములు, అత్తరహీంబాషా, బత్తల గంగాధర్, కరెంటు ఆది, మాధవరెడ్డి, మారుతీస్వామి, నాగేంద్ర, చెలిమిశివరాం, తొగట అనిల్, వాసుదేవ, బాబావలి, లోకేశ్, ఆనందరెడ్డి, వీర, తెలుగుమహిళలు ముతకూరు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

టీడీపీ హయాంలోనే మైనార్టీలకు న్యాయం

ఫొటో ఫ్రేమ్‌లను అందజేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

టీడీపీ హయాంలోనే ముస్లింలకు న్యాయం జరుగుతుందని టీడీపీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రదాన కార్యదర్శి నాగూరుస్సేన్ పేర్కొన్నారు. పట్టణంలోని 14 వార్డులో ముస్లిం నాయకుల ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలకు పవిత్రంగా బావించే యాసిన్నూర పోటోలను టీడీపీ మైనార్టీ నాయకులు మంగళవారం ముస్లింల ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. దర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు అత్తర్ రహీంబాషా, మైనార్టీనాయకులు రాళ్లపల్లిషరీఫ్, సలీంబాష, ఉస్మాన్, టీడీపీనాయకులు చింతపులుసు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన 'సామకోటి'

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ టిడిపి అధినేత చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉండవల్లి లోని బాబు నివాసంలో కలిసి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరించారు. అలాగే సామకోటి తన బయోడేటాను బాబుకు సమర్పించారు. పార్టీ అభివృద్ధి కోసం తాను చేపట్టిన కార్యక్రమాలు పుట్టపర్తిలో అన్న క్యాంటీన్ ప్రారంభించిన విషయాన్ని బాబుకు వివరించినట్లు సామకోటి తెలిపారు. రాబోయే ఎన్నికలలో కష్టపడి పని చేయాలని కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని బాబు చెప్పారని సామకోటి చెప్పారు. తాను చేపట్టిన సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషిని బాబు అభినందించారని సామకోటి తెలిపారు.

చంద్రబాబుకు చిత్రపటాన్ని ఇస్తున్న సామకోటి

మార్చి నుంచి రాగిపిండి పంపిణీ : జేసీ

పుట్టపర్తి అర్బన్ : చౌక దుకాణాల ద్వారా మార్చి నుంచి బియ్యం, రాగులతో పాటు రాగిపిండి పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో వచ్చే నెల నుంచి రాగులతో పాటు, రాగి పిండి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కేజీ రాగి పిండిని 11 రూపాయలకు ప్యాకెట్ రూపంలో డీలర్లు పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న ఆరోగ్యసురక్ష

గాండ్లపెంట : మండల పరిధిలోని వేపరాల సచివాలయ పరిధిలోని మంగళవారం జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో కె రామానాయక్, వైద్యాధికారి ఉమామహేశ్వర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల కోసం ఇంటి వద్దకు వైద్యం అందించే కార్యక్రమం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈసందర్భంగా దాదాపు 350 మందికి వైద్య పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉమాదేవి, వైద్యసిబ్బంది ఉపేంద్రరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు

వ్యక్తి ఆత్మహత్య

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ప్రసాద్(35) సోమవారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయాడని మంగళవారం సుబ్బరావు పేట నుండి కందుర్పర్తికి వెళ్లే రహదారికి చింతచెట్టుకు శవమై వేలాడుతూ కన్పించడానికి మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

బత్తలపల్లి : ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేసి నాలుగు లక్షల రూపాయల విలువ చేసే ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ, ఎస్ఐ మాట్లాడుతూ దొంగను అరెస్టు చేసి అతని నుండి 4 లక్షల రూపాయల విలువ చేసే 5 మోటార్ సైకిల్ లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నల్లమాడ మండలం సానేవారిపల్లికి చెందిన నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

పుట్టపర్తిలో కర్నాటక వాసి మృతి

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం కర్నాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. కర్నాటక రాష్ట్రం యాదగిరికి చెందిన సురేష్ (33) పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్లో మృతిచెందినట్లు డిపో మేనేజర్ ఇనాయతుల్లా తెలిపారు. ఈ మేరకు పుట్టపర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. పోలీసలు మృతునిబంధువులకు సమాచారం అందించారు. మృతుడు చికిత్స నిమిత్తం రెండు రోజుల క్రితం పుట్టపర్తికి వచ్చాడని పోలీసులకు తెలిపారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

తలుపుల : మండలకేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దని ఎస్ఐ దిలీప్‌కుమార్ కోరారు. బస్సు షెల్టర్ ఎదుట ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు అడ్డంగా ఉంచరాదన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మడకశిర రూరల్ సిఐగా రాజ్ కుమార్

మడకశిర : మడకశిర రూరల్ సిఐగా రాజ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

హిందూపురం : మార్చి 9వ తేదీన జరగాల్సిన జాతీయ మెగా లోక్ అదాలత్ వాయిదా పడినట్లు స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ మంగళవారం తెలిపారు. కక్షిదారులు న్యాయవాదులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె సూచించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మార్చి 16వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్, ఇన్సూరెన్స్, సివిల్ తగాదాలు వంటి కేసులతో పాటు రాజీ కాదగిన క్రిమినల్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

పుట్టపర్తి రూరల్: త్వరలో జరగబోవు సాధారణ ఎన్నికల విధుల నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిఆర్ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎస్టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగబోవు 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, ఇటీవల ప్రమాదాలకు గురై మెడికల్ లీవ్ లో ఉన్న ఉపాధ్యాయులకు, మెటర్నిటీ లీవ్ లో ఉన్న ఉపాధ్యాయులకు, ఒంటరి మహిళలకు, చంటి పిల్లల తల్లులకు, రిటైర్మెంట్ దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎన్నికల విధులకు హాజరైన ఉపాధ్యాయులు ఎన్నికలు ముగిసిన వెంటనే సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన నేపథ్యంలో బస్సు సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా కార్యదర్శులు సంపత్ కుమార్, వెంగమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం

మడకశిర : తెలుగుదేశం పార్టీ నాయకులు వర్గ విభేదాలు లేకుండా పనిచేద్దామని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సునీల్ కుమార్ మంగళవారం తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వర్గ విబేధాలు వీడాలన్నారు. నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తెద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశ్వద్ధామప్ప, నరసయ్య గౌడ్, ఈశ్వర్ సాగర్, హనుమంత గౌడ్, మంజునాథ్, క్రిష్టప్ప, నరేష్, మంజునాథ్, ప్రకాష్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

బత్తలపల్లి : చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఆర్డీటీ నిర్వహించిన క్విజ్ ఫెస్టివల్ లో చిన్నారులు కనబరిచిన ప్రతిభ పలువురిని ఆకట్టుకుంది. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో నిర్వహించిన రీజనల్ స్థాయి క్విజ్ ఫెస్టివల్లో చిన్నారులు తమ ప్రతిభను చాటారు. ముఖ్య అతిథులుగా బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ ప్రమీల,ఏటిఎల్ రుక్మాంగద పాల్గొన్నారు.ఐదు ఏరియాలనుండి 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానములు వచ్చిన పిల్లలు జిల్లాస్థాయిలో జరిగే క్విజ్ ఫెస్టివల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటివ్‌లు, ఎస్టీఎల్‌లు, సిఒలు, సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం

ఓబుళదేవరచెరువు : ప్రతి ఇంటికీ తాగునీరు అందించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎఇ దీపిక, ఎపిఎం రమణప్ప తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జలజీవన్ మిషన్ కార్యక్రమం భాగంగా మండల పరిధిలోని గ్రామ జల సంఘాల కమిటీ సభ్యులకు తాగునీరు అందించే నిమిత్తం కాంట్రాక్ట్ పనుల నిర్వహణ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జల జీవన్ మిషన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ధనుంజయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, డిఆర్‌డిఎ సిబ్బంది, జల సంఘాల కమిటీ సభ్యులు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

ధర్మవరం టౌన్ : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని వాసవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికదేవాంగ కల్యాణ మండపంలో ఫేర్వెల్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ ఈశ్వరయ్యతోపాటు డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ...విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకుసాగాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇంటర్ పరీక్షలలో ప్రతిభ కనబరచిన 26 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినిలు

'సూపర్‌సిక్స్'తో అందరికీ లబ్ధి

కదిరిటౌన్ : టీడీపీ జనసేన ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజలకు లబ్ది చేకూరుతుందని కందికుంట సతీమణి కందికుంట యశోదదేవి అన్నారు. ఈ మేరకు ఆమె పట్టణంలోని 18వ వార్డులో గడపగడపకు వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, పారుక్, అస్లాంబాషా, ఇర్ఫాన్, ఇస్మాయిల్, తాజ్మహల్ , అస్లాం, బాబ్జాన్, జబ్బార్, ఖాదర్ బాబా, పీరా, ఐటిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మన్సూర్, జూనైద్ పవన్, మహిళా నాయకురాలు పర్వీన్ భాను, కౌన్సిలర్ సావిత్రమ్మ, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ, ఉమాదేవి, పరిమళమ్మ , రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న యశోదాదేవి